సాక్షి
నిజామాబాద్

బుధవారం । 6 । నవంబర్ । 2024



బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు శిక్షణ
రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు మోర్తాడ్ బాలికల పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహించారు.
- 8లో ▸



'సాక్షి' స్పెల్ బీ
విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు 'సాక్షి' మీడియా కృషి చేస్తోంది. ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో 'స్పెల్ బీ' పరీక్ష నిర్వహించింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /16.5

వాతావరణం
ఉదయం ఆహ్లాకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సజావుగా ధాన్యం కొనుగోలుకు చర్యలు



సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా అన్నిరకాల చర్యలు చేపట్టామని, కేంద్రాల్లో సమస్యలు రాకుండా చూడాలని సివిల్ సప్లయీస్ డీఎం అంబదాస్ రాజేశ్వర్ సూచించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్, గిరిరాజ్ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దొడ్డు, సన్నరకాల వివరాలను వేర్వేరుగా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. గన్నీ, ట్రాన్స్‌పోర్ట్, రైస్‌మిల్లుల్లో, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నగరశివారులోని గన్నీ సంచుల గోదాము, ఎంఎల్‌ఎస్ పాయింట్, ఎఫ్‌ఆర్‌కే గోదామును పరిశీలించారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో పీడీఎస్ బియ్యం పంపిణీతోపాటు ఇతర వివరాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎం కార్యాలయ అకౌంటెంట్ శ్రీధర్, గోదాము నిర్వాహకులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నాగారం: వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాజశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం కింద 13 మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 9వ తేదీలోగా దరఖాస్తులను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు nizamabad. telangana. gov.inను సంప్రదించాలని సూచించారు.

గాంధీభవన్ సదస్సులో జిల్లా నాయకులు



నిజామాబాద్ సిటీ: 'కుల గణన – సకల జనులకు ఆదరణ' అనే అంశంపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం నిర్వహించిన సదస్సులో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుటుంబ సర్వేపై చర్చించారు. బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

వరుస విజయాలతో నిజామాబాద్ జట్టు





హర్షవర్ధన్‌సింగ్


నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహిస్తున్న అండర్–23 రాష్ట్రస్థాయి టోర్నీలో నిజామాబాద్ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. మంగళవారం నిర్వహించిన మ్యాచ్‌లో మెదక్ జట్టు టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత ఓవర్లలో 234 పరుగులు చేయగా, నిజామాబాద్ జిల్లా జట్టు 40 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. హర్షవర్ధన్‌సింగ్ 114 పరుగులుచేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జట్టు కోచ్‌గా సురేశ్‌బాబు, ఫీల్డింగ్ కోచ్‌గా లలిత్‌రెడ్డి, మేనేజర్‌గా నయూమ్ వ్యవహరించారు. బుధవారం నల్గొండతో మ్యాచ్ జరగనుంది.

సరిహద్దులో విస్తృతంగా తనిఖీలు

మద్నూర్: రాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం చెక్‌పోస్ట్ వద్ద అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా ఈ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని ఏవో రాజు తెలిపారు.

సర్వేకు సర్వం సిద్ధం

- నేటి నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- 370 మంది సూపర్ వైజర్లు, 3,343 మంది ఎన్యుమరేటర్లు



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. మున్సిపాలిటీలు, డివిజన్ల వారీగా సర్వేను పూర్తి చేసేందుకు గత మూడు రోజుల నుంచి జిల్లాలో హౌస్ లిస్టింగ్ పూర్తిచేశారు. సర్వే చేపట్టాల్సిన ఇళ్లను బ్లాక్‌లుగా విభజించి అందుకు అనుగుణంగా సర్వే సిబ్బందిని కేటాయించారు. 1273 మంది ఆశ కార్యకర్తలు, 2182 మంది అంగన్‌వాడీ టీచర్లు, 537 మంది పంచాయతీరాజ్ సెక్రెటరీలు, 1873 మంది ఎస్జీటీ (టీచర్లు) సర్వేలో పాల్గొననున్నారు. నిజా మాబాద్ నగరంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, విద్యా శాఖ పరిధిలోని బోధనేతర, మెప్మా సిబ్బందికి కూడా విధులు కేటాయించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాల విధులు నిర్వర్తించిన అనంతరం సర్వే ప్రారంభిస్తారు. ప్రాథమిక పాఠశాలలకు మధ్యాహ్నం తరువాత సెలవు ఇవ్వనున్నారు. ఇంటింటికీ వెళ్లనున్న సర్వే సిబ్బంది ప్రతి కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తారు.

75 అంశాలు.. 56 కాలాలు

సమగ్ర కుటుంబ సర్వేలో 75 అంశాలకు సంబంధించి వివరాలను 56 కాలమ్స్‌లో పొందుపర్చనున్నారు. వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలను నమోదు చేయనున్నారు. సేకరించిన పూర్తి వివరాలను నిర్దేశిత ప్రొఫార్మ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

సర్వే చేపట్టే సిబ్బంది వివరాలు

డివిజన్	బ్లాక్‌లు	ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు
ఆర్మూర్	934	946	110
బోధన్	564	563	72
నిజామాబాద్	715	758	86
బల్దియా	బ్లాక్‌లు	ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు
నిజామాబాద్	725	725	73
ఆర్మూర్	140	156	14
భీమ్‌గల్	29	36	03
బోధన్	138	159	12
మొత్తం	3,245	3,343	370



మాక్లూర్‌లోని రైతువేదికలో సర్వే సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

స్ఫూర్తిదాయక ప్రస్థానం..

- భిక్షమెత్తే స్థాయి నుంచి డీఎస్పీ వరకు..
- ఎమ్మెల్సీ బరిలోకి ఆర్మూర్‌కు చెందిన మదనం గంగాధర్



మదనం గంగాధర్, ఆర్మూర్

ఆర్మూర్: చిరు ప్రాయంలో భిక్షాటన చేసిన బాలుడు చదువును నమ్ముకొని పోలీసు శాఖలో డీఎస్పీ స్థాయికి ఎదిగాడు. తర్వాత యువత రాజకీయాల్లో రాణిస్తేనే మార్పు సాధ్యమని భావించి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్న మదనం గంగాధర్ జీవిత ప్రస్థానం నేటి యువతరానికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తోంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణం రాజారాం నగర్ కాలనీలోని సంచార జాతికి చెందిన మదనం రాజలింగం, గంగమ్మ దంపతులకు ఐదుగురు కొడుకులు.. వారిలో మొదటి వాడైన గంగాధర్ పేదరికం కారణంగా బాల్యంలో భిక్షాటన చేయడంతోపాటు బాల కార్మికుడిగా, న్యూస్ పేపర్ బాయ్‌గా, వీధుల్లో పెప్సీ అమ్మి, కూలీ పనులు చేసి రాత్రి వేళల్లో విద్యనభ్యసించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల విద్య పూర్తి చేసిన అనంతరం 1994–97 బ్యాచ్ లో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో సీట్ సంపాదించాడు. 1998లో 22 ఏళ్ల ప్రాయంలో ఎస్సై గా ఉద్యోగం సాధించడం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. 2010 లో నల్గొండలో సీఐ గా తరువాత డీఎస్పీగా పదోన్నతులు పొందాడు. 26 సంవత్సరాల పోలీస్ సర్వీసులో ఒక్క మెమో కూడా తీసుకోకుండా నిబద్ధతతో విధులు నిర్వహించిన ఫలితంగా కఠిన సేవా పతకం, ఉత్తమ సేవా పతకంతో పాటు సుమారు 200 సార్లు వివిధ ప్రశంసా పత్రాలు, అవార్డులను పొందాడు. నల్గొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 12 పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌వో గా విధులు నిర్వహించి విధి నిర్వహణలో తనకంటూ ప్రత్యేకత సాధించాడు. హైదారాబాద్ పోలీసు విభాగంలోని సిట్ (ఎస్ఐటీ)లో విధులు నిర్వహించే క్రమంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ లో నిందితులను గుర్తించడంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. అదేవిధంగా హైదారాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్వోటీ)లో డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించాడు. ఇక్కడే తన డీఎస్పీ పదవికి ఇటీవల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. ప్రస్తుతం తన 26 సంవత్సరాల పోలీస్ ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా వదిలి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ గా పోటీకి నిలవనున్నాడు. సమాజం, యువత, నిరుద్యోగులు, పోలీసు శాఖలో సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తాను ఎన్నికల్లో విజయం సాధించి పెద్దల సభకు వెళ్లి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

కుమార్తె నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేస్తూ..

- విద్యుదాఘాతంతో తండ్రి మృత్యువాత

మోర్తాడ్(బాల్కొండ): కుమార్తె నిశ్చితార్థానికి ఒక రోజు ముందు విద్యుదాఘాతంతో తండ్రి మృతి చెందిన విషాద ఘటన నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తొర్తి గ్రామంలో చోటు చేసుకుంది.

గ్రామానికి చెందిన గంధం వెంకన్న(52)కు ఒకే ఒక కుమార్తె ఉంది. ఆమెకు గ్రామంలోని బంధువుల యువకుడితో బుధవారం నిశ్చితార్థానికి నిర్ణయించారు.. ఈ మేరకు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం వంట కోసం కట్టెలను తీసుకొచ్చేందుకు వెంకన్న కట్టెల మండికి వెళ్లారు. మండిలో కొన్ని కట్టెలను తీసే క్రమంలో ఇనుప చువ్వను తొలగిస్తుండగా అది అక్కడే పైన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకింది. వెంకన్న విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దు:ఖంలో అంత్రక్రియలను పూర్తి చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్: పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ధర్నా చౌక్‌లో తపస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన మద్దతు ప్రకటించి ప్రసంగించారు. ప్రభుత్వం టీచర్ల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత కొంత కాలంగా నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పెండింగ్, బిల్లులు, సరెండర్ బిల్లులను విడుదల చేయడంతోపాటు పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుదర్శన్, వరప్రసాద్, నాయకులు రాఘవేందర్, కిషన్‌రెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్, నారాయణ, ప్రభాకర్, రాజకుమార్, నరోత్తం, రమాదేవి, స్వప్న, లహరి, కవిత, మీన తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌లో జిల్లాకు తృతీయ స్థానం



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో జిల్లా బాలబాలికల జట్లు తృతీయ స్థానం సాధించాయి. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలో అండర్–17 బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, కోచ్‌లు కిరణ్, పరిశీలకులు రమేశ్ అభినందించారు.

అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనమే..

- మినీ అంగన్‌వాడీలకు మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తింపు
- పాత వేతనంతోనే సరిపెడుతున్న ప్రభుత్వం
- ట్రెజరీలో సాంకేతిక సమస్యే కారణం
- నష్టపోతున్న అంగన్‌వాడీ టీచర్లు

మోర్తాడ్(బాల్కొండ): మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసినా వారి వేతన పెంపును ప్రభుత్వం మరిచింది. చేసే పనిలో తేడా ఏమి లేకపోయినా వేతనం విషయంలోనే తమకు అన్యాయం జరుగుతోందని మినీ అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. జిల్లాలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 1,145 మంది కార్యకర్తలను మెయిన్‌గా, 135 మందికి మినీ అంగన్‌వాడీలుగా గుర్తింపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అప్‌గ్రేడ్ చేస్తూ జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది.

పెంచిన వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను మాత్రం ఏప్రిల్ 2024 నుంచి వర్తింపజేయనున్నట్లు పేర్కొంది. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.13,500, మినీ అంగన్‌వాడీలకు రూ.7,500 వేతనం చెల్లించేవారు. అప్‌గ్రేడ్ చేయడంతో అందరికి సమానమైన వేతనం లభించే అవకాశం ఏర్పడింది. ఏప్రిల్, మే నెలల్లో రూ.13,500 వేతనం అందింది. ఆ తరువాత ఐదు నెలలు మాత్రం పాత లెక్క ప్రకారమే వేతనాన్ని ఖాతాల్లో జమ చేశారు. ఆర్థిక శాఖ(ట్రెజరీ)లో సాంకేతిక సమస్య కారణంగా మినీ అంగన్‌వాడీలుగా పని చేసిన వారికి పాత వేతనం జమవుతోందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి పనికి తగిన వేతనం చెల్లించే ఏర్పాట్లు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

సమస్యను పరిష్కరించాలి

మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనమే చెల్లిస్తున్నారు. ట్రెజరీలోని సాంకేతిక సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం చేయాలి. అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలను అందించాం.

– దేవగంగు, అంగన్‌వాడీ కార్యకర్తల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

అంతటా ఇదే సమస్య

అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలను పెంచలేదు. మొదట్లో రెండు నెలలు కొత్త వేతనం మంజూరు చేశారు. ఆ తరువాత సాంకేతిక సమస్య కారణంగా పాత వేతనమే లభిస్తుంది. ఉన్నతాధికారులకు ఈ సమస్యను విన్నవించాం. రాష్ట్ర స్థాయిలోనే సమస్య నెలకొనడంతో పరిస్థితిలో మార్పు లేదు.

– రసూల్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

చేప పిల్లల విడుదల మరింత ఆలస్యం

- సీడ్ సరఫరాలో తీవ్ర జాప్యం
- నోటీసులు జారీ చేసిన మత్స్యశాఖ అధికారులు
- కాంట్రాక్టు నుంచి తొలగిస్తామని హెచ్చరిక



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై అందజేసే చేప పిల్లల సరఫరా కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న వారి వద్ద అవసరమైనంత సీడ్ లేకపోవడంతో నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల మరింత ఆలస్యమవుతోంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికనుగుణంగా జిల్లాలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయ్యింది. దీంతో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ సీరియస్ అయ్యారు. చేప పిల్లల సరఫరాలో జాప్యం చేసిన వారికి నోటీసులు ఇవ్వాలని జిల్లా మత్స్య శాఖ ఏడీని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ఒకరిద్దరు గుత్తేదార్లకు నోటీసులు జారీ చేశారు. అగ్రిమెంట్ ప్రకారం చేప పిల్లలను చెరువులకు సరఫరా చేయపోతే కాంట్రాక్టు నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ ఓ కాంట్రాక్టర్ తీరు మార్చుకోవడం లేదని తెలిసింది.

50 శాతం దాటని పంపిణీ

ఈ ఏడాది జిల్లాలోని 967 చెరువుల్లో 2.27 లక్షల చేప పిల్లలు వదిలేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 35 నుంచి 40ఎంఎం, 80 నుంచి 100 ఎంఎం సైజున్న పిల్లలను సరఫరా చేసేందుకు ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకున్నారు. టెండరు ఆలస్యం కావడంతో సెప్టెంబర్ నెలలో పూర్తి కావాల్సిన చేప పిల్లల పంపిణీ ఇప్పటి వరకు 50 శాతం కూడా దాటలేదు. మరో పక్షం రోజుల్లో వందశాతం పూర్తి చేయాల్సి ఉంది. కాగా చిన్న సైజు చేపపిల్లలే ఉండడంతో గుత్తేదార్లు ప్రస్తుతం 35 నుంచి 40ఎంఎం సీడ్‌ను సరఫరా చేస్తున్నారు. కాంట్రాక్టర్ల వద్ద తగినంత సీడ్ లేకపోవడంతో బయటి నుంచి తెప్పించి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే చేప పిల్లల పంపిణీ నెమ్మదిగా సాగుతోందని తెలుస్తోంది. అయితే మంగళవారం నాటికి 422 చెరువుల్లో 89.52లక్షల చేప పిల్లలు వదిలారు. ఇంకా 545 చెరువుల్లో 87లక్షలకు పైగా చేప పిల్లలను వదలాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు 34 నుంచి 40ఎంఎం చేప పిల్లలు మాత్రమే చెరువుల్లో వదలగా, 80 నుంచి 100ఎంఎం చేప పిల్లలు వదలాల్సి ఉంది. ఎక్కువ సైజు ఉన్న చేప పిల్లలు కాంట్రాక్టర్ల వద్ద ఉన్నాయా? తక్కువ సైజుగల పిల్లలను వదిలి చేతులు దులుపుకుంటారా? అనేది వేచి చూడాలి.

వేగవంతం చేస్తున్నాం



చేప పిల్లలను సరఫరాలో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చాం. త్వరత్వరగా సరఫరా చేయకపోతే కాంట్రాక్టు నుంచి తొలగించాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు ఇచ్చారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం కాకుండా వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరు నాటికి నూరుశాతం పూర్తి చేస్తాం.

– ఆంజనేయస్వామి, మత్స్యశాఖ ఏడీ

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణ, ప్రమాద బీమా

- రూ.10లక్షల బీమా వర్తింపు
- ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం

డొంకేశ్వర్(ఆర్మూర్): బ్యాంకు లింకేజీ ద్వారా రుణం పొందిన మహిళా సంఘాల సభ్యులకు లోన్ బీమాతో పాటు ప్రమాద బీమాను సైతం రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలకు బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. గతంలో స్త్రీనిధి ద్వారా రుణం పొందిన వారికే బీమా ఉండేదని, ఇప్పటి నుంచి ఎస్‌హెచ్‌జీ ద్వారా బ్యాంకు రుణం పొందిన వారికి కూడా వర్తిస్తుందన్నారు. రుణం పొందిన సభ్యులు ఏ విధంగా మరణించినా మిగిలిన అప్పును ఏజెన్సీ బాధ్యతలు చూస్తున్న స్త్రీనిధి చెల్లిస్తుందన్నారు. అదే విధంగా మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉండి రుణం తీసుకున్నా, తీసుకోకపోయినా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల బీమా డబ్బులు కుటుంబంలో నామినీగా ఉన్న వారికి వస్తాయన్నారు. రుణ, ప్రమాద బీమాకు ప్రభుత్వ మే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని మహిళా సంఘాల సభ్యులకు తెలుపాలన్నారు. అనంతరం బీమాను ఏవిధంగా క్లెయిమ్ చేయాలో అవగాహన కల్పించారు. ఏపీడీ రవీందర్, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్, డీపీఎంలు నీలిమ, సంధ్యారాణి, మారుతి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఆర్డీవో సాయాగౌడ్, అధికారులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జట్టుకు శిక్షణ



మోర్తాడ్: హన్మకొండలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో సన్నద్ధ శిక్షణ శిబిరం నిర్వహించారు. హెచ్ఎం ప్రభాకర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సులోచన, ఉపాధ్యాయులు రవి, రవీందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో అండర్–14 బాలుర, బాలికలకు హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో నరేందర్ హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్సార్ నాగరాజు, టి విద్యాసాగర్ రెడ్డి, సాయన్న, శివప్రసాద్, సునీత, సురేందర్, రాజేశ్, రమణ, మాధురి, అజ్మత్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘స్పెల్‌బీ’కి విశేష స్పందన

- ఉత్సాహంగా పరీక్షలు రాసిన విద్యార్థులు
- ఇంగ్లిష్ భాషపై అవగాహన పెంచుతోందంటూ విద్యార్థుల హర్షం



ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'సాక్షి' మీడియా కృషి చేస్తోంది. నగరంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉదయం 10 గంటలకు 'స్పెల్‌బీ' పరీక్షలు నిర్వహించారు. పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 23 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. స్పెల్‌బీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారు. ఈ పరీక్ష తమకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది 'సాక్షి' ఆధ్వర్యంలో 'స్పెల్‌బీ' పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయి పరీక్షలు ఉంటాయి. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేశ్, ఎస్ఎఫ్ఎస్ టీచర్లు ఆశలత, నూర్జహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణం!

- ప్రయివేట్ ఆస్పత్రి ఎదుట మృతుని బంధువుల ఆందోళన



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల ఓ ప్రవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గుండెపోటుతో మరణించాడని మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ (40) ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేరారు. మహేందర్ కు వైద్యులు అన్ని రకాల టెస్ట్‌లు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎలాంటి గుండెపోటు లేదని వైద్యులు నిర్ధారించారు. అయితే సోమవారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన మహేందర్ ఆదే రోజు అర్ధరాత్రి మృతి చెందారు. వైద్యులు సడెన్‌గా స్ట్రోక్ రావడంతో మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. టౌన్ సీఐ శ్రీనివాసరాజు, ఎస్సైలు యాసీన్ ఆరాఫత్, శ్రీకాంత్ మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. బంధువులు ఆందోళన విరమించారు.

యువకుడి అదృశ్యం



ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌కు చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంటి సత్యసాయి అనే యువకుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారడు. సోమవారం సాయంత్రం సత్యసాయిని తండ్రి వెంకటేశ్వరావు మందలించాడు. దీంతో కోపంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోతల్లో రైతన్న బిజీ బిజీ..



కంజర శివారులో ట్రాక్టర్‌లో వచ్చిన ధాన్యం



రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రైతులు పంటపొలాల్లో బిజీ బిజీగా గడుపుతున్నారు. పంటపొలాల్లో వరికోత మిషన్లతో పంటను కోయిస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో నింపి రోడ్లపై ఆరబెడుతున్నారు. అనంతరం కాంటా చేసి లారీల్లో ఎక్కించి విక్రయించడానికి తరలిస్తున్నారు. ఇలా వరికోతల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



కులాస్‌పూర్ శివారులో హార్వెస్టర్‌తో వరికోతలు

గుండెపోటుతో ఒకరి మృతి



మాక్లూర్: గుండెపోటుతో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని వల్లభాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుర్మ రాజశేఖర్(53) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం వల్లభాపూర్ నుంచి కొనుగోలు కేంద్రానికి సంబంధించిన హమాలీలను మెట్‌పల్లిలో దించి తిరిగి వస్తుండుగా ఆటోను ఆన్ చేసే క్రమంలో గుండెపోటుకు గురై కిందపడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

క్రైం కార్నర్

తొమ్మిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు



నందిపేట్: మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన కొమిరె సుధాకర్‌పై దాడికి పాల్పడిన 9 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని చిలుకల చిన్నమ్మ ఆలయ సమీపంలో షాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడనే సమాచారం మేరకు కొమిరె సుధాకర్ మరో ముగ్గురితో కలిసి ఘటన స్థలానికి వెళ్లాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లయ్యని ఆస్పత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఆలయం వద్ద పండుగ చేసుకునే కొందరు సుధాకర్‌పై దురుసుగా ప్రవర్తించి, కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. దీంతో సుధాకర్ కాలు విరగడంతో పాటు పలుచోట్ల గాయాలయ్యాయి. బాధితుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు..

దోమకొండ: మండల కేంద్రంలో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గొలుసుల మహేశ్ ఇంటికి ఈనెల 4న రాత్రి తన మేనమామ కుమార్తె శ్యామల వచ్చింది. అదే సమయంలో మేనమామ కుమారుడు పల్లపు రమేశ్ ఈ ఇంటికి ఎందుకు వచ్చావని ఆమెను తిడుతుండగా మహేశ్ అడ్డుగా వెళ్లాడు. దీంతో రమేశ్ మహేశ్‌పై కారం చల్లి కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

నాగిరెడ్డిపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సదరు బాలుడు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్ట్

రుద్రూర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండలం బొప్పాపూర్‌కు చెందిన ముజీబ్ అనే యువకుడు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రేమ పేరుతో లోబరుచుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధిత యువతి ముజీబ్ ఇంటికి రాగా తాళం వేసి పారిపోయాడు. బాధితురాలు ఈనెల 30న పీఎస్‌లో ఫిర్యాదు చేసి ప్రియుడి ఇంటి వద్ద బైఠాయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టణ పీఎస్‌లో 79 వాహనాలు

కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కారణాల చేత వదిలివేయబడిన 79 వాహనాలు ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయా వాహనాలకు సంబంధించిన యజమానులు రాకపోవడంతో తదుపరి చర్యల గురించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీఎస్‌లో ఉన్న వాహనాల యజమానులు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. లేకుంటే వాహనాలను మరికొన్ని రోజుల్లో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



సాయిరెడ్డి మృతదేహం

తాడ్వాయి: అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టేకుల సాయిరెడ్డి(47) ఇటీవల నూతన ఇంటిని నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగుడుకు బానిసై యువకుడు..

దోమకొండ: తాగుడుతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమకొండ మండల కేంద్రంలో చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొత్త నరేశ్(30) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. అంతేకాకుండా అతను కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరికోత యంత్రానికి తప్పిన ప్రమాదం



క్రేన్, జేసీబీ సాయంతో వరికోత యంత్రాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం గేటు వద్ద మంగళవారం ఉదయం వరికోత యంత్రానికి ప్రమాదం తప్పింది. ఐచర్ వాహనంలో వరికోత యంత్రాన్ని తరలిస్తున్నారు. హైదరాబాద్–బోధన్ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణానికి తవ్విన గుంతలోకి ఐచర్ వాహనం మట్టిలోకి జారుకుంది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో వాహనం గుంతలోకి వెళ్లకుండా మట్టిలో కూరుకుపోయింది. అక్కడే హైవే పనులు చేపడుతున్న గుత్తేదారు జేసీబీ, క్రేన్‌లను తెప్పించి వాహనాన్ని బయటకు తీయించారు. గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది.

కామారెడ్డిలో చైన్ స్నాచింగ్

కామారెడ్డి క్రైం: బైక్‌పై వెళ్తున్న ఓ జంటను వెంబడించి దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అడ్లూర్ గ్రామానికి చెందిన కుంబాల రాజు, సౌమ్య దంపతులు. వీరు బైక్‌పై కామారెడ్డి నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా జయశంకర కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి మరో బైక్‌పై ఇద్దరు అగంతకులు వెంబడించారు. బ్రిలియంట్ స్కూల్ సమీపంలోకి రాగానే సౌమ్య మెడలో నుంచి మూడు తులాల గొలుసును బైక్‌పై వెనుక కూర్చున్న దుండగుడు లాక్కుని పరారయ్యారు. సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బిచ్కుంద: మండలంలోని హాజ్గుల్‌లో మంజీర నుంచి సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీఐ నరేశ్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

వెండి ఆభరణాలు పట్టివేత



బిచ్కుంద: మండల కేంద్రంలో వెండి ఆభరణాలను పట్టుకున్నట్లు సీఐ నరేశ్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి బిచ్కుందలో వెండి ఆభరణాలను జీరో బిల్లుతో అమ్ముతున్నట్లు తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సదరు వ్యక్తి వద్ద ఉన్న కారును తనిఖీ చేయగా వెండితో తయారు చేసిన దీపాలు, ఉంగరాలు, కాళ్ల పట్టిగొలుసులు లభించాయి. సుమారు 6 కిలోల వరకు వెండి ఉండడంతో దీనికి సంబంధించిన బిల్లులు చూయించాలని అడిగితే ఎలాంటి బిల్లులు చూయించలేదు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కామారెడ్డి ట్రెజరీ కార్యాలయంలో ఆభరణాలను అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన బండారు నరేందర్ మంగళవారం బ్యాంకుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొని గాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. బాధితుడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బల్ల సాయికుమార్ ఈనెల 2న అంచనూరు గ్రామానికి కూలీ పనికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ అతివేగంగా వచ్చి ఢీకొన్నట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. దీంతో సాయికుమార్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రాణాలు కాపాడిన డయల్-100

బాల్కొండ: ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత, ఇద్దరు పిల్లలను మెండోరా పోలీసులు మంగళవారం కాపాడారు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత తన భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో కలిసి మెండోరా మండలం పోచంపాడ్‌లో ఉన్న ఎస్సారెస్పీలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. ప్రాజెక్టుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళ, పిల్లలను గమనించిన పర్యాటకులు వెంటనే డయల్–100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సదరు మహిలకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మెడికల్ షాపులో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని వరణ్య మెడికల్ షాపులో దొంగతనం జరిగినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్‌వో మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ముగ్గురు దుండగులు రెండు బైక్‌లపై వచ్చి మెడికల్ షాప్‌లో చొరబడి రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు పేర్కొన్నారు. మెడికల్ యజమాని గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.



చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నవీపేట: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన గుంజె లక్ష్మణ్(75) గత నెల 20న నిజామాబాద్ వైపు ఆటోలో వెళ్తుండగా ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో లక్ష్మణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడు..

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన మందముల జీవన్(35) అనే యువకుడు సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ మంగళవారం తెలిపారు. ఇంట్లో స్నానం కోసం వేడి నీళ్ల బకెట్ తీసుకొని బాత్‌రూంలోకి వెళ్తుండగా కాలుజారి కింద పడటంతో తలకు బలమైన గాయాలై మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం బస్తాలు పడి ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని మంచిప్పలో లారీలోని ధాన్యం బస్తాలు పడి గ్రామానికి చెందిన రాజయ్యకు మంగళవారం స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో ధాన్యం బస్తాలను లోడ్ చేసుకుని వెళ్తున్న లారీ నుంచి అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటున్న వెళ్తున్న రాజయ్యపై ధాన్యం బస్తాలు పడ్డాయి. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.